ముత్యాల రాతతో మార్కులకు మార్గం

- గుండ్రంగా రాద్దాం-మార్కులు పట్టేద్దాం
- సాధనతోనే సత్ఫలితాలు
- ఉత్తీర్ణతలో దస్తూరీకి ప్రాధాన్యం



పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

మామిడికుదురు: పదో తరగతి పరీక్షలు ముంచుకొస్తుండటంతో విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించే దిశగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న అంశాలను రెండున్నర గంటల్లో కాగితంపై రాయాలి. అదీ స్పష్టంగా, ఎలాంటి కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా ముత్యాల్లాంటి అక్షరాలతో 150 నిముషాల్లో 50 మార్కులకు జవాబులు రాయాల్సి ఉంటుంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి చేతి రాతపై నిలిచింది.

సాధనతో సత్ఫలితాలు..

ఇప్పటివరకు సరిగా రాయకపోయినా ఒక్కసారిగా రాత మార్చుకోవాలంటే నిత్యం సాధన చేయాల్సిందే. తొమ్మిదో తరగతి వరకు దస్తూరి ఎలా ఉన్నా పదో తరగతి ప్రారంభం నుంచి దృష్టి సారిస్తే మంచి ఫలితం ఉంటుంది. నిత్యం నాలుగైదు పేజీలు గుండ్రంగా రాయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లం, హిందీ, తదితర సబ్జెక్టులపై ఇదే విధానం అమలు చేయాలి. పైకి చదువుతూ రాయడం వల్ల జవాబులు బాగా గుర్తుండటంతో అక్షరాలు అందంగా రాయడం అలవాటవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

దస్తూరితో ఆకట్టుకోవచ్చు..

నెమ్మదిగా రాస్తే పరీక్షల్లో సమయం సరిపోదు, వేగంగా రాసేటప్పుడు తప్పులు దొర్లకుండా ముత్యాల్లాంటి అక్షరాలు రాసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్లిప్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏ ప్రశ్నకైనా రాసే సత్తా ఉన్నా చేతిరాత బాగోకపోతే మార్కులు సాధించడం కష్టతరమవుతుందంటున్నారు. పరీక్ష పత్రాలు దిద్దేవారు చక్కని అక్షరాలతో ఆకట్టుకున్న ఆన్సర్ షీటుకు మంచి మార్కులు వేస్తారని, తద్వారా పర్సంటేజ్ శాతం పెంచుకోవచ్చంటున్నారు. రాసే ప్రతి అక్షరం, అందంగా గుండ్రంగా ఉండాలని, అక్షర దోషాలు లేకుండా అవసరమున్న చోట ఫుల్‌స్టాప్, కామా, తదితర గుర్తులు ఉపయోగించి సమాధానాలు రాయాలని పేర్కొంటున్నారు. అక్షరాలు కొన్ని చిన్నవిగా మరి కొన్ని పెద్దవిగా ఉండకుండా చూడాలని, జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు.

చేతిరాతతో మార్కులకు భరోసా



ముత్యాల్లాంటి అక్షరాలతో మార్కులకు ఢోకా ఉండదు. చేతి రాతను మెరుగు పర్చేందుకు విద్యార్థులకు జూన్ నుంచి శిక్షణ ఇస్తున్నాం. సమాధానాలు దిద్దేవారికి సులభంగా అర్థమైనప్పుడు మార్కులకు భరోసా కలుగుతుంది. తక్కువ సమయంలో అస్పష్టమైన సమాధానాలు దిద్దే అవకాశం లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. తప్పుల్లేకుండా అందంగా రాయడం వల్ల అవి ఇన్విజిలేటర్లను ఆకట్టుకుంటాయి. తద్వారా మంచి మార్కులు సాధించవచ్చు.

– పంచాడి వీర్రాజు, తెలుగు టీచర్, జెడ్పీహెచ్‌స్కూల్, పెదపట్నంలంక

గుండ్రంగా రాస్తున్నా



గతంలో కంటే ఇప్పుడు నా రాత మెరుగు పడింది. నిత్య సాధనతోనే ఇది సాధ్యమైంది. మా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. చదివించడం, ప్రశ్నలకు జవాబులు రాయించడం చేస్తున్నారు. దీంతో తప్పులు రాయకుండా గుండ్రంగా రాయడం మాకు అలవాటైంది. మా చేతి రాతతో మేము మంచి మార్కులు సాధిస్తామన్న నమ్మకం ఏర్పడింది.

– పినిశెట్టి గీతాశ్రీ, పదోతరగతి విద్యార్థిని

ప్రత్యేక సాధన చేయించారు



మా స్కూల్‌లో ప్రతి రోజు ఒక సబ్జెక్ట్‌లో పత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆ సబ్జెక్టుల్లో దస్తూరి కోసం ప్రత్యేకంగా సాధన చేయిస్తున్నాను. కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా అక్షరాలు గుండ్రగా, అందంగా, మనసును హత్తుకునేలా దస్తూరిలో సాధన చేస్తున్నాను. గతం కన్న నా దస్తూరి ఇప్పుడు ఎంతో మెరుగైంది. నా చేతి రాత పట్ల గతంలో భయపడే వాడిని, నేను ఇప్పుడు ఎంతో నిశ్చింతగా ఉన్నాను.

– బయ్యా రామ్‌చరణ్, పదో తరగతి విద్యార్థి

కుప్తంగా

ఉరదాలమ్మకు ఎమ్మెల్యే పూజలు



ఉరదాలమ్మ ఆలయంలో గరగను శిరస్సున ధరించి ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో వేంచేసిన ఉరదాలమ్మ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చెరువుగట్టు సమీపాన ఉన్న అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి జరిగిన జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆలయ ఆచారమైన అమ్మవారి గరగను నెత్తిన ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తన భక్తిని చాటుకున్నారు. సర్పంచ్ పెంటపాటి శ్యామల, ఎంపీటీసీ చంద్రు సునీత, పెంటపాటి వెంకట్రావు, ఆకుల రామకృష్ణ, నల్లి రాజు, జడ్డు సతీష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ముత్యాల పుల్లారావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని భారత్ పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీఓ త్రిశూలపాణి తెలిపారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా ఈ చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా విజయదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ



ప్రతిష్ఠా మహోత్సవం పూజలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: పెదపట్నంలంక దుర్గాపట్నంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విజయదుర్గ అమ్మవారి ఆలయ యంత్ర, ప్రతిష్ఠ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ మాఘ శుద్ధ విదియ 8.43 గంటలకు శతతారా నక్షత్ర యుక్త మీనలగ్నంలో ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనుల పండువలా జరిపించారు. గిడుగు శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులతో పాటు మరో ముగ్గురు దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు జరిపించారు. మహావాది రామవెంకట నృసింహశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, గోపూజ, యంత్ర స్థాపన, కుంకుమార్చన, పూర్ణాహుతి తదితర పూజలను ఘనంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వైభవంగా వీరభద్రుని సంబరం

పి.గన్నవరం: స్థానిక గొల్లల వీధిలో గుండుబోగుల సూర్యనారాయణ స్వగృహంలో వెలసిన బాల వీరభద్రస్వామి వారి గద్దె వద్ద సోమవారం వీరభద్రస్వామి సంబరం ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామి 5వ వార్షికోత్సవం సందర్భంగా సూర్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ గరుడేశ్వర స్వామి ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించి, అక్కడ పూజలు చేశారు. అనంతరం గద్దె వద్ద వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. రాత్రి వీరభద్రస్వామి త్రిశూల పూజలు జరిగాయి.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: మాఘపౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డీఎం కేడీఎంఎస్ కుమార్ ఆదివారం తెలిపారు. నాలుగు రోజులు యాత్రగా సూపర్ లగ్జరీ బస్సు ఈనెల 22న బయలుదేరి 25వ తేదీన తిరిగి రావులపాలెం చేరుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం టికెట్ ధర రూ.3,200గా నిర్ణయించామన్నారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా రావులపాలెం చేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం సంప్రదించాలని డీఎం కోరారు.

అభివృద్ధికి నిదర్శనమే అల్లూరి పార్కు



ఆత్రేయపురంలో పార్కు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నా సరే కేవలం అధికారమే లక్ష్యంగా తప్పుడు ప్రచారాన్ని టీడీపీ చేస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో నేడు ఆత్రేయపురంలో జరిగిన అల్లూరి సీతారామరాజు పార్కు నిర్మాణమే సాక్ష్యమన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న అల్లూరి సీతారామరాజు పార్కు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పార్కు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పార్కు ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును తీసుకువస్తామన్నారు. ఈ పార్కులో తన సొంత నిధులతో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆత్రేయపురం నడిబొడ్డున పార్కు నిర్మాణం గ్రామానికి వన్నే తెచ్చే విధంగా ఉందన్నారు. గత పాలకుల హయంలో ఎన్నడూ కనీసం చెరువు పూడిక తీత పనులు కూడా చేపట్టలేదన్నారు. నేడు సీఎం జగన్ పాలనలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ.వందల కోట్లతో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను అందించామన్నారు. ఇంత జరుగుతున్న కళ్లుండి కూడా చూడలేని పచ్చకామెర్ల ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయన్నారు. ఈ ఆ పార్కును ఈనెల 18న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అంతే కాకుండా ఈ పార్కు వల్ల గ్రామస్తులకు ఆహ్లాదకరమైన వాతావారణం లభించడమే కాకుండా పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించడం వల్ల అన్ని వయసుల వారికి ఆరోగ్యం కూడా లభించనున్నట్లు జగ్గిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పనులు త్వరితగతిన పూర్తి చేసిన కాంట్రాక్టరు అభినందించారు.

సారా బట్టీలపై దాడులు



కోరుమిల్లిలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది, అధికారులు

ఆలమూరు: జొన్నాడ-యానాం ఏటిగట్టు వెంబడి లంక ప్రాంతాల్లో అక్రమంగా సారా తయారీ చేస్తున్న బట్టీలపై ఆలమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) దాడులు నిర్వహించింది. స్థానిక ఎస్సై ఎ.సత్యవేణి కథనం ప్రకారం కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి సమీపంలో ఏర్పాటు చేసిన బట్టీలో సారా తయారీ చేస్తున్నారనే సమగ్ర సమాచారంలో ఎస్‌ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సారా బట్టీ వద్ద సిద్ధంగా ఉన్న 500 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారులు, భూయజమానుల కోసం ప్రత్యేక బృందాలను ఎస్‌ఈబీ ఏర్పాటు చేసింది. ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా స్థానికులు సత్వరమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్సై సత్యవేణి సూచించారు. అలాంటి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరు గ్రామశివారు మారిశెట్టి పాలెం వద్ద సారా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వెలిచేరులో సారా రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఎంతో గుర్తింపు ఇచ్చారని, ప్రధానంగా శెట్టిబలిజలకు ఎనలేని గుర్తింపునిచ్చారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీకి చెందిన శెట్టిబలిజ సమావేశానికి కాండ్రేగుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్సీ చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పదవుల కేటాయింపులో శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. రాజ్యాధికారం సాధన దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యనారాయణరావు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. అప్పనపల్లి దేవస్థానం తరపున ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీపాశర్లపూడి సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీలు జోగి వెంకటరామకృష్ణ, యాండ్ర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదం జరగడంతో అంగవైకల్యంతో కాలు, చేయి పనిచేయని బాధితుడికి వైద్య సాయానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల నగదు సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బిక్కిన సాయినాగదుర్గ శివగణేష్ (25) మెట్ల మీద నుంచి పడిపోవడంతో వెన్నెముకకి దెబ్బ తగిలి ఎడమ కాలు, చేయి పని చేయడం లేదు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్న సాయి మంచానికే పరిమితమయ్యాడు. తండ్రి కూలి పనికి వెళుతూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఉన్న ఇంటి స్థలం అమ్మేసి కొంత వైద్యం చేయించారు. అయినా పూర్తిగా కోలుకోలేదు. గుంటూరులో ఆపరేషన్ చేయించాల్సి ఉందని వైద్యం కోసం కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సాయం చేయమని కుటుంబ సభ్యులు కోరడంతో రూ.15 వేలు నగదు సాయాన్ని అందించినట్టు సభ్యులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



పసుపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి పిలుపునిచ్చారు. తూర్పు సెంటిమెంట్‌కు అనుగుణంగా పసుపల్లి గ్రామం నుంచి ఆదివారం పార్టీ ప్రచారం చేపట్టారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పార్టీ ఇన్‌చార్జ్‌గా విప్పర్తి వేణుగోపాలరావు నియామకంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో పర్యాయం సీఎం పదవి చేపట్టడంతో పాటు పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీని గెలపించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పేరి శ్రీనివాస్, దేవరపల్లి చినబాలయోగి, మైలా ఆనందరావు, ఉందుర్తి నాగబాబు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది

రావులపాలెం: రక్తదానం ఆపదలో ఉన్న ఎన్నో ప్రాణాలను కాపాడుతుందని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నేషనల్ హైవే ఈతకోట టోల్‌ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎస్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక టోల్ ప్లాజా వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఆసక్తి కలిగిన యువకులు పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు. అలాగే రోడ్డు భద్రతా అంశాలపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ప్రధాని మోదీని అభినందిస్తూ తీర్మానాలు



మామిడికుదురులో సర్పంచ్ నుంచి తీర్మానం తీసుకుంటున్న బీజేపీ నేతలు

మామిడికుదురు: భవ్యమైన రామమందిర నిర్మాణం, బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేసిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని అభినందిస్తూ ప్రజా ప్రతినిధుల నుంచి బీజేపీ నేతలు ధన్యవాద తీర్మానాలు తీసుకుంటున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, మండల శాఖ అధ్యక్షుడు కంకిపాటి సుబ్బారావు ఆదివారం ధన్యవాద తీర్మానాలు తీసుకున్నారు. మామిడికుదురు సర్పంచ్ గోస్ మొహిద్దీన్ తీర్మానం అందజేశారు. వేమా మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితర ప్రజా ప్రతినిధుల నుంచి ప్రధాని మోదీకి మద్దతుగా తీర్మానాలు తీసుకుంటున్నామన్నారు.

శాంతిభద్రతలను కాపాడడం అందరి బాధ్యత

మలికిపురం/రాజోలు: సమాజంలో శాంతిభద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ విజయ్‌కుమార్ వర్మ, రాజోలు సీఐ గోవిందరాజు అన్నారు. ఆదివారం మలికిపురం, రాజోలు పోలీసుస్టేషన్ల వద్ద శాంతి భద్రతల అంశంపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వారిరువురు మాట్లాడుతూ, మత కలహాలు, ఘర్షణలు చోటు చేసుకున్న సమయాల్లో అక్కడి శాంతి భద్రతలను కాపాడడం సివిల్ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది బాధ్యత అని అన్నారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న వేళ ఆయా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, కవాతులు నిర్వహిస్తున్నట్టు వర్మ తెలిపారు. తొలుత మలికిపురం సెంటర్లో సివిల్ పోలీసులు, ఆర్ఏఎఫ్ ఆధ్వర్యాన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగేల్, ఇన్‌స్పెక్టర్లు ప్రధాన్, రమేష్ కుమార్‌రాజ్, ఏఎస్సై చంద్రశేఖర్, హెచ్‌సీ జీవన్, సివిల్ ఎస్సై బి.సంపత్ కుమార్, ఏఎస్సై టి.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలుడికి రూ.21 వేల ఆర్థిక సాయం



బాలుడు మేనమామకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన ఏడేళ్ల బాలుడి వైద్యానికి ఆదివారం దాతలు రూ.21 వేల ఆర్థిక సహాయం అందించారు. మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10 వేలు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి కార్యవర్గ సభ్యులు రూ.11 వేలు వెరసి రూ.21 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని బాలుడి మేనమామ కడలి సాయికుమార్‌కు మొగలికుదురులో అందజేశారు. కార్యక్రమంలో దొంగ రామమోహన్, గుబ్బల గోవర్ధన పద్మ పాల్గొన్నారు.

చురుగ్గా బారికేడ్ల నిర్మాణ పనులు



అంతర్వేది ఆలయం వెలుపల జరుగుతున్న ఇనుప బారికేడ్ల నిర్మాణ పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో రానున్న తీర్థ మహోత్సవాలకు భక్తులు క్యూలో వెళ్లి స్వామిని దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయం వెలుపల, లోపల, ప్రాంగణంలో ఇనుప బారికేడ్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. పదిరోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు సుమారు 4 లక్షల మంది భక్తుల వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల తాకిడికి తగ్గట్టుగా పిల్లాపాపలతో ప్రతి ఒక్కరికీ స్వామివారి దర్శనం కలగజేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

కొత్తపేట ఎస్సైగా అశోక్



అశోక్

కొత్తపేట: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీల్లో భాగంగా కొత్తపేట మండలం సబ్ ఇనెస్పెక్టర్‌గా నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలను జారీ చేశారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ఎం.అశోక్ ప్రస్తుతం మండపేట టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కోటనందూరుతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎస్సైగా ఉన్న జ్వాలాసాగర్ అదనపు ఎస్సైగా విధులు నిర్వహించనున్నారు.

రావులపాలెం ఎస్సైగా రాజేష్



రాజేష్

రావులపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా కె.రాజేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా నుంచి వచ్చిన రాజేష్ స్థానిక స్టేషన్‌లో ఎస్సైగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో 'పల్లెకు పోదాం'



వీవీ మెరకలో ఇంటింటా పథకాల బ్రోచర్ ఇస్తున్న బీజేపీ శ్రేణులు

సఖినేటిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బీజేపీ శ్రేణులు పల్లెకు పోదాం కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ శ్రేణులతో కలసి గ్రామాల్లో ఇంటింటా పథకాలపై రూపొందించిన బ్రోచర్లను ఇచ్చి, పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు, నాయకులు జీవీవీ సత్యనారాయణ, యెనుముల సతీష్, కొంఠతం శ్రీనివాసరావు, తిరుమల వెంకటేశ్వరరావు, పోలిశెట్టి గంగ పాల్గొన్నారు.